క్లుప్తంగా

నేడు వైద్య శిబిరం

అమరాపురం: స్థానిక ప్రాథమిక మెయిన్ పాఠశాల ఆవరణలో ఆదివారం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు కూటమి సభ్యులు డాక్టర్ బసవరాజు, శ్రీనివాసమూర్తి తెలిపారు. స్త్రీ వ్యాధి నిపుణురాలు జ్యోతి, దంత వైద్యులు నాగేంద్రకుమార్ రోగులకు వైద్య పరీక్షలు చేస్తారన్నారు. ఉదయం 9 గంటల లోపు టోకన్లు తీసుకోవాలన్నారు. వైద్యంతో పాటు మందులు ఉచితంగా అందజేస్తామన్నారు.

అన్నదాన సత్రం నిర్మాణానికి విరాళాలు

లేపాక్షి: లేపాక్షిలో దాతల సహకారంతో చేపట్టిన అన్నదాన సత్రం నిర్మాణానికి పలువురు విరాళం అందజేశారు.కొటిపి గ్రామానికి చెందిన కళావతమ్మ, హనుమంతరెడ్డి రూ. 15,116, బింగిపల్లికి చెందిన సుధాకర్‌రెడ్డి రూ.10,116, లేపాక్షికి చెందిన హోటల్ బసవరాజు, రూ 10,116, బిసలమానేపల్లికి చెందిన ప్రసాద్ రూ. 10,116, బసవనపల్లికి చెందిన మాజీ ఎమ్మెల్యే అంజినరెడ్డి కుమారుడు సుధాకర్‌రెడ్డి రూ. 10,116, లేపాక్షి జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి రూ.10,116, టీడీపీ కన్వీనర్ జయప్ప, ఎంపీటీసీ సభ్యురాలు లలితమ్మ రూ. 25 వేలు, గొంగిటిపల్లికి చెందిన లారీ యజమాని శ్రీనివాసులు రూ.10,116, లేపాక్షికి చెందిన ఎంఆర్ లారీ యజమాని రూ. 10,116 విరాళం అందజేశారు.

ముగిసిన ఉత్సవాలు

అమరాపురం: హేమావతి గ్రామంలో నిర్వహిస్తున్న గంగమాలమ్మ ఉత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

నరేగా పనులపై అవగాహన

పావగడ: కూలీలు జాబ్ కార్డు పొంది నరేగా పనుల ద్వారా ఉపాధి పొందాలని డప్పు కళాకారుల సంస్థ కార్యకర్త రామకృష్ణ సూచించారు. నరేగా పనులపై తాలూకాలోని పోతగానహళ్లిలో శనివారం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. రోజుకు రూ. 309 కూలి లభిస్తుందని, పనులు కావాల్సినవారు ఫారం నంబర్ 6 అందజేయాలన్నారు. సంస్థ కార్యకర్త వెంకటేశ్, కళాకారులు లత, మమత పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



ఆస్పత్రి క్వార్టర్స్ నిర్మాణాలకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణప్ప

పావగడ: పట్టణంలోని తాలూకా ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు, నర్సులు, డీ గ్రూప్ ఉద్యోగుల క్వార్టర్స్ నిర్మాణాలకు ఎమ్మెల్యే వెంకటరమణప్ప శనివారం భూమి పూజ నిర్వహించారు. రూ.5 కోట్లతో క్వార్టర్స్ నిర్మిస్తున్నామని ఆయన తెలిపారు. అనంతరం పీఎల్డీ బ్యాంకు ఎదురుగా దుకాణాల సముదాయ భవనం రెండవ అంతస్థు నిర్మాణానికి భూమిపూజ చేశారు.

జేడీఎస్ నూతన కార్యవర్గాల ఎంపిక

పావగడ: జేడీఎస్ పట్టణ నూతన కార్యవర్గాన్ని శనివారం ఎంపిక చేశారు.అధ్యక్షుడిగా గడ్డం తిమ్మరాజు, గౌరవాధ్యక్షుడిగా ఈరణ్ణ, కార్యాధ్యక్షుడిగా నాగేంద్ర, సీనియర్ ఉపాధ్యక్షులుగా కొండ్రాళ్ల రామణ్ణ, ఎస్ కే నాగరాజు, లక్ష్మీనరసప్ప, వెంకటేశ్, ప్రధాన కార్యదర్శిగా కన్మేడి లోకేశ్, కార్యదర్శులుగా సాధిక్ సాబ్, శ్రీరామప్ప మడివాళ, సంఘటనా కార్యదర్శిగా వడ్డెర కృష్ణమూర్తి, మీడియా ప్రతినిధిగా బ్రహ్మచారిని ఎంపిక చేశారు. ఆదేవిధంగా పట్టణ యువజన విభాగం అధ్యక్షుడిగా గేట్ కుమార్, మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా సుహైల్‌ను ఎంపిక చేశారు. వీరిని మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప, బలరామరెడ్డి అభినందించారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రచారం

గోరంట్ల (సోమందేపల్లి): పశ్చిమ రాయలసీమ టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్ర రెడ్డి శనివారం గోరంట్లలో పర్యటించారు. ప్రైవేటు పాఠశాల యూనియన్ నాయకులను కలిసి మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ప్రైవేటు పాఠశాల కరస్పాండెంట్లు ప్రవీణ్ కుమార్, గౌస్, మధుసూదన్, రామ్మోహన్ రెడ్డి, లక్ష్మీపతి, ఓబుల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

హిందూపురం: చిలమత్తూరు మండలం మొరంపల్లికి చెందిన నాగరాజు (45) శనివారం చిలమత్తూరులోని ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వ్యక్తిగత కారణాలు, ఇంట్లో సమస్యల కారణంగా జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు ప్రాథమికంగా తెలిసిందని పోలీసులు తెలిపారు. ఈ మేరకు విచారణ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చిన్నారులకు టీకాలు తప్పని సరి

అమరాపురం: చిన్నారులు వ్యాధులకు గురికాకుండా టీకాలు వేయించాలని ఆశా కార్యకర్తలకు హేమావతి పీహెచ్‌సీ వైద్యాధికారి భార్గవ్ సూచించారు. శనివారం స్థానిక పిహెచ్‌సీలో ఆయన ఆశా కార్యకర్తలు, సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. గ్రామాల్లో నవజాత శిశువులకు టీకాలు వేయిస్తున్నారా లేదా అని ఆరా తీయాలన్నారు. గ్రామాల్లో ప్రతి శుక్రవారం డ్రైడే పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంపీహెచ్‌ఈఓ ఉమాపతి పాల్గొన్నారు.

జగనన్నతో పేదల జీవితాల్లో వెలుగులు



జీఎస్ పాళ్యంలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్



ఈ ఫొటోలో ఉన్న మహిళ పేరు బోయ ఓబుళమ్మ. జీఎస్ పాళ్యం గ్రామం, రొళ్ల మండలం. మూడు న్నరేళ్లుగా వివిధ పథకాల కింద ఆమె కుటుంబానికి రూ.2,26,558 లబ్ధి చేకూరింది. వైఎస్సార్ రైతు భరోసా ద్వారా రూ.40,500, వైఎస్సార్ చేయూత కింద రూ.37,500, వైఎస్సార్ ఆసరా కింద రూ.3,524, వైఎస్సార్ పింఛన్ కానుక కింద రూ.1,42,500, వైఎస్సార్ సున్నా వడ్డీ కింద రూ.2,534 లబ్ధి చేకూరింది. సీఎం జగనన్న చేసిన మేలును ఎప్పటికీ మరువలేమని, జీవితాంతం రుణ పడి ఉంటామన్నారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నకు మద్దతు ఇస్తామని ఆమె పేర్కొంది.

- వచ్చే ఎన్నికల్లోనూ జగనన్నకే మద్దతు
- స్పష్టం చేసిన ప్రజలు
- అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- ఎమ్మెల్యే తిప్పేస్వామి, ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్

రొళ్ల: అర్హత ఉంటే చాలు పథకాలు ఇస్తున్నారు. మా జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు..జీవితాంతం జగనన్నకు రుణపడి ఉంటామని పలు గ్రామాల ప్రజలు అన్నారు. మండలంలోని గుడ్డగుర్కి సచివాలయం పరిధిలోని దాసప్పపాళ్యం, గిరేనాయకనపాళ్యం గ్రామాల్లో ఎమ్మెల్యే తిప్పేస్వామి శనివారం 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన ఇంటింటికీ వెళ్లిన సమయంలో లబ్ధిదారులు తమ మనసులో మాటను వెల్లడించారు. అందిన పథకాలు వివరిస్తూ సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తూ సమస్యలపై ఆరా తీశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చారన్నారు. ప్రభుత్వంపై ప్రతిపక్ష పార్టీలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్ననకు మద్దతు ఇచ్చి మరోమారు ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ నళిని, సర్పంచు హరిక్రిష్ణ, ఎంపీటీసీ లింగరాజు, వైస్ సర్పంచ్ గౌడయ్య, వైస్ ఎంపీపీ రత్నమ్మ, ఎంపీడీఓ రామారావు, ఈఓఆర్డీ క్రిష్ణప్ప, సింగిల్‌విండో అధ్యక్షుడు మోతి రాంనాయక్, మార్కెట్ యార్డు డైరెక్టర్ శ్రీనివాస్, ఎస్సీ సెల్ కన్వీనర్ ఆంజినేయులు, ఎస్‌ఐ వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీరామప్ప, గోవిందరాజు, జీటీ కరియన్న, రాజన్న, నరసింహమూర్తి, శివలింగప్ప, బండెప్ప, డీలర్ మూర్తి, నాగరాజు, రంగధామ, శివనంద్ పాల్గొన్నారు.

జగనన్న వచ్చాకే మహిళల ఆర్థికాభివృద్ధి

హిందూపురం: జగనన్న సీఎం అయిన తర్వాతనే డ్వాక్రా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందారని, డ్వాక్రా సంఘాలు డీ నుంచి ఏ గ్రేడ్‌కు అప్‌గ్రేడ్ అయ్యాయని ఎమ్మెల్సీ మహమ్మద్‌ఇక్బాల్ అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మన్ జబివుల్లా, కౌన్సిలర్ రహమత్‌బీతో కలిసి పట్టణంలోని 12వ వార్డులో మోడల్ కాలనీలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు జరిగిన లబ్ధిని వివరిస్తూ సమస్యలు తెలుసుకున్నారు. పారిశుధ్యం, వీధిలైట్లు తదితర సమ్యలను ప్రజలు ఆయన దృష్టికి తీసుకెళ్లగా వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ తమది చేతల ప్రభుత్వమన్నారు. ఎన్నికల సమయంలో వచ్చి మాయమాటలు చెప్పి అరచేతిలో వైకుంఠం చూపించి సినిమా డైలాగులు చెప్పి తిరిగి పత్తాలేకుండా పోయే నాయకులం కాదన్నారు.

డ్వాక్రా సంఘాలను అప్పులపాలు చేసిన చంద్రబాబు..

ఇంట్లోని నగలన్నీ బ్యాంకుల్లో పెట్టి రుణాలు తీసుకోండి..నేను అధికారంలోకి రాగానే విడిపించి డ్వాక్రా గ్రూపులను రుణవిముక్తిచేస్తానని చంద్రబాబు 2014 ఎన్నికల్లో మహిళలకు హామీ ఇచ్చారని, తీరా అధికారంలోకి వచ్చాక వడ్డీ కూడా చెల్లించలేదన్నారు. దీంతో మహిళలు అప్పుల ఊబిలో కూరుకుపోయారన్నారు. సంఘాలన్నీ డీ గ్రేడ్‌లోకి వెళ్లాయన్నారు. అక్కాచెల్లెమ్మల ఇబ్బందులను గమనించిన వైఎస్ జగన్ 2019లో అధికారంలోకి రాగానే మహిళా గ్రూపుల రుణాలన్నీ మాఫీ చేశారని, దీంతో ఆయా డ్వాక్రా సంఘాలు ఏగ్రేడ్‌కు చేరాయన్నారు. ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. వివక్ష లేకుండా పథకాలు అందుతున్నాయని టీడీపీ సానుభూతిపరులే చెబుతున్నారని, జగన్ అందిస్తున్న జనరంజకమైన పాలనే ఇందుకు నిదర్శనమన్నారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నకు మద్దతు పలికి మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలి కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మల్లికార్జున, కోఆప్షన్ సభ్యుడు రహమత్, నాయకులు చాంద్ బాషా, ఫక్రుద్దీన్, నాగరాజు, షరీఫ్, కార్తీక్, షమీం, సమీవుల్లా పాల్గొన్నారు.

హైకోర్టు జడ్జికి సన్మానం



న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న న్యాయవాదులు

పెనుకొండ: హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్ కుమార్‌ను పలువురు న్యాయవాదులు శనివారం స్థానిక ఆర్అండ్‌బి అతిథి గృహంలో ఘనంగా సన్మానించారు. అనంత ఆణిముత్యాలు కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆయన పట్టణానికి వచ్చారు. ఈ సందర్భంగా ఏజీపీ భాస్కరరెడ్డి, ఆసిఫ్ అబూబకర్, చంద్రశేఖర్‌రెడ్డి, వాల్మీకి శ్రీనివాసులు, నాగార్జున, సుదర్శనరెడ్డి తదితరులు జస్టిస్ ప్రవీణ్‌కుమార్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు.

లేపాక్షిలో కేంద్ర బృందం

లేపాక్షి: ఉపాధి హామీ పథకం అమలు తీరును పరిశీలించేందుకు శనివారం జిల్లాకు వచ్చిన జాతీయ స్థాయి బృంద సభ్యులు(ఎన్ఎల్ఎం) ప్రదీప్‌కుమార్ పైక్రే, సంతోష్‌కుమార్ ప్రధాన్ లేపాక్షి వీరభద్రస్వామి ఆలయాన్ని సందర్శించారు. వీరభద్రస్వామి, దుర్గాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంలోని శిల్పాలు, చిత్రలేఖనాలు, ఆలయ విశిష్టతను అర్చకుల ద్వారా తెలుసుకున్నారు.

ఉద్యానపంటలపై దృష్టి పెట్టండి



రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: ప్రభుత్వ ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు శనివారం వైస్ చాన్స్‌లర్ టు విలేజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దత్తత గ్రామమైన బుళ్లసముద్రం గ్రామంలో సాగైన ఉద్యాన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ రమణ రైతులతో మాట్లాడుతూ ఉద్యాన పంటల సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. నీటి సౌకర్యం ఉన్న రైతులు ఉద్యానపంటల సాగు చేసి ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. పంటలకు తెగుళ్లు సోకకుండా సస్యరక్షణ పద్ధతులు పాటించాలని సూచించారు. అధ్యాపకురాలు మౌనిక, పీడీ రాజేష్, విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా రథసప్తమి వేడుకలు





నీలకంఠాపురంలో కళ్యాణ రంగనాథస్వామిని ఊరేగిస్తున్న దృశ్యం, సూర్య నమస్కారాలు చేస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: మండలంలోని నీలకంఠాపురం గ్రామంలో నీలకంఠేశ్వరస్వామి సముదాయ ఆలయంలో శనివారం రథసప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సూర్యప్రభ, శేష, గరుడ, అశ్వ, సింహ, చంద్రప్రభ వాహన సేవలతో భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం గ్రామంలో కళ్యాణ రంగనాథస్వామిని ఊరేగింపు నిర్వహించారు. అర్చకులు భక్తులకు ప్రసాద వినియోగం చేశారు. కమిటీ సభ్యులు సునీత రఘువీర్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా సూర్యనమస్కారాలు

హిందూపురం టౌన్: యోగాతో వ్యాధులకు దూరంగా ఉండవచ్చని యోగా గురువు బద్రీ నారాయణ అన్నారు. రథసప్తమిని పురస్కరించుకుని యోగా థెరఫీ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో వాసవీ విన్నర్స్ పాఠశాలలో శనివారం 108 సూర్య నమస్కారాలు, యోగాసనాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ యోగాను అభ్యసించవచ్చని సూచించారు. ఎస్‌డీజీఎస్ కళాశాల కార్యదర్శి బైసాని రాంప్రసాద్, శంకరప్ప, మహేంద్ర, రమేష్, రాజేశ్వరి, భారతి, బాలాజీ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతో రాష్ట్రం సస్యశ్యామలం

- వైఎస్సార్‌సీపీ నాయకురాలు చౌళూరు మధుమతిరెడ్డి



నరసాపురంలో ప్రజలతో మాట్లాడుతున్న మధుమతిరెడ్డి

హిందూపురం: జగనన్న పాలనలోనే రాష్ట్రం సుభిక్షంగా సస్యశ్యామలంగా ఉంటుందని వైఎస్సార్‌సీపీ నాయకురాలు చౌళూరు మధుమతిరెడ్డి అన్నారు. ప్రజలతో మమేకం కార్యక్రమంలో భాగంగా హిందూపురం మండలంలోని కగ్గల్లు పంచాయతీ నరసాపురం గ్రామంలో శనివారం ఆమె పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలుకరిస్తూ సంక్షేమ పథకాలను వివరించారు. సమస్యలపై ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మోసాలకు పాల్పడిన టీడీపీని ఇంటికి పంపారని, ఆ పార్టీ నేతలు చెప్పే మాటలు నమ్మవద్దన్నారు. సీఎం వైఎస్ జగనన్న అన్నివర్గాలకూ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, జగనన్నను ఆశీర్వదించి మళ్లీ ముఖ్యమంత్రిని చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు రంగనాథ్, వైస్ ఎంపీపీ రామాంజి, వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్బిరెడ్డి, క్రిష్టప్ప, ఆసియా, ప్రమీలమ్మ, గాయత్రి, బాబు, అశ్వత్థప్ప, గంగాధర, నాగ్రేంద పాల్గొన్నారు.

ఈకేవైసీ నమోదు వేగవంతం చేయండి



మాట్లాడుతున్న ఏడీఏ అల్తాఫ్‌అలీఖాన్

హిందూపురం: పీఎం కిసాన్ పథకం కింద అర్హులైన రైతులను గుర్తించి ఈకేవైసీ వేగవంతం చేయాలని ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ అధికారులకు సూచించారు. స్థానిక అసిస్టెంట్ డివిజన్ వ్యవసాయశాఖ కార్యాలయంలో శనివారం మండల వ్యవసాయ అధికారులతో ఆయన సమావేశమై మాట్లాడారు. అర్హులైన రైతులందరూ పీఎం కిసాన్‌ను సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. రబీలో సాగు చేసిన పంటలకు ఈక్రాప్ పూర్తి చేయాలన్నారు. పంటల సాగుకు ఎరువులు సిద్ధం చేయాలన్నారు. పురుగు మందుల పిచికారీ కోసం డ్రోన్లు అందించేందుకు రైతులతో గ్రూపులు ఏర్పాటు చేయాలని సూచించారు. పొలంబడి కార్యక్రమాలు కొనసాగిస్తూ సలహాలు సూచనలు అందించాలని చెప్పారు. సమావేశంలో హిందూపురం, చిలమత్తూరు, లేపాక్షి, పరిగి, గోరంట్ల మండలాల ఏఓలు పాల్గొన్నారు.

వైభవంగా అగ్నిగుండ మహోత్సవం



అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న దృశ్యం

మడకశిర: పట్టణంలోని గాంధీబజార్‌లో వెలసిన వీరభద్రస్వామి అగ్నిగుండ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ప్రారంభమైన ఈ మహోత్సవం శనివారం తెల్లవారు జాము 5 గంటల వరకు జరిగింది. ఈసందర్భంగా వీరభద్రస్వామి మూల విరాట్‌ను సర్వాంగసుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలను న్విహించారు. అనంతరం అగ్నిగుండం ఏర్పాటు చేయగా మొక్కుబడులున్న భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. పట్టణ ప్రజలతో పాటు వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

కోడిరంగనాథస్వామికి దీపోత్సవం



జ్యోతులతో ఊరేగింపుగా వెళుతున్న మహిళలు

లేపాక్షి: మండలంలోని శిరివరం గ్రామంలో కోడిరంగనాథస్వామి ఆలయ వార్షిక రథోత్సవం సందర్భంగా శనివారం దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళలు జ్యోతులతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని స్వామివారికి సమర్పించారు. అనంతరం కోడిరంగనాథస్వామిని ప్రత్యేకంగా అలంకరించి మంగళవాయిద్యాల మధ్య కలశస్థాపన, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. తర్వాత శ్రీవారి కల్యాణోత్సవం, ప్రాకారోత్సవం తదితర కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తర్వాత భక్తులకు అన్నదానం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకురాలు మధుమతిరెడ్డి, సర్పంచ్ నేత్రావతి, ఎంపీటీసీ సభ్యురాలు నాగమణి, గ్రామపెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి

సోమందేపల్లి: గృహ లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలని హౌసింగ్ డీఈ నాగరాజు, ఎంపీడీవో వెంకటేశ్వర్లు సూచించారు. హౌసింగ్ డే సందర్భంగా మండలంలోని పాపిరెడ్డిపల్లి వద్ద ఉన్న జగనన్న కాలనీలో శనివారం వారు పర్యటించారు. పనులు మొదలు పెట్టిన వెంటనే బిల్లులు కూడా అందిస్తామని, ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని లబ్ధిదారులకు సూచించారు.ఏఈ నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకూ...

రొళ్ల: గుడ్డగుర్కి సచివాలయ పరిధిలోని క్యాతప్పపాళ్యం, గొట్టుగుర్కి, గొట్టుగుర్కిగొల్లహట్టి గ్రామాల్లో ఆదివారం ఉదయం 9.30 గంటలకు ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆధ్వర్యంలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామారావు, సర్పంచ్ హరిక్రిష్ణ, ఎంపీటీసీ లింగరాజు తెలిపారు.

ఘనంగా వేమన జయంతి



జ్యోతులు మోస్తున్న మహిళలు

రొద్దం: మండల పరిధిలోని కంబాలపల్లి గ్రామంలో శనివారం వేమన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేమన చిత్రపటాన్ని ఏర్పాటుచేసి పూజలు చేశారు. అనంతరం జ్యోతుల మధ్య ఊరేగించారు. రెడ్డి సంఘం నాయకులు పాల్గొన్నారు.

చైన్‌స్నాచింగ్

హిందూపురం: పట్టణంలో చైన్‌స్నాచర్లు తెగబడ్డారు. ఆర్టీసీ కాలనీకి చెందిన ఝాన్సీరాణి అనే మహిళ శనివారం రాత్రి శివాలయానికి వెళ్లి ఇంటికి వెళ్తుండగా బైక్‌లో వచ్చిన ఇద్దరు దుండగులు ఆమె మెడలోని మూడున్నర తులాల బంగారు గొలుసు లాక్కెళ్లారు. బాధితురాలు వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసునమోదు చేసి దుండగుల కోసం గాలిస్తున్నారు.

కేంద్ర పథకాలపై ప్రచారం

పావగడ: బీజేపీ చేపట్టిన బూత్ స్థాయి విజయ సంకల్ప అభియానలో భాగంగా తాలూకాలోని వళ్లూరు, రాయచర్లు గ్రామాల్లో శనివారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బీ కే మంజునాథ్ పర్యటించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. పథకాలకు సంబంధించిన స్టికర్లను ఇళ్లకు అతికించారు. గ్రామానికి చెందిన సీనియర్ రాజకీయ నాయకుడు చెన్నకేశవరెడ్డి ఇంటిలో మంజునాథ్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో తాలూకాలో బీజేపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. దొడ్డహళ్లి అశోక్, రవి శంకర నాయక్, డాక్టర్ జీ వెంకట్రామయ్య, లాయర్ కృష్టానాయక్, కొత్తూరు హనుమంతరాయ, సాకేల్ శివకుమార్ పాల్గొన్నారు.

ప్రకృతిని కాపాడుకుందాం



ప్రసంగిస్తున్న వైద్యురాలు నీలిమారెడ్డి

పెనుకొండ: ప్రకృతిని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నీలం రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. కళాశాలలో శనివారం ఎన్ఎస్ఎస్, మహిళా సాధికారత నేతృత్వంలో ప్రకృతి ధర్మం, సాధన మార్గం అన్న అంశంపై సెమినార్ నిర్వహించారు. ప్రిన్సిపాల్‌తోపాటు వైద్యురాలు నీలిమారెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలకు మానవ తప్పిదాలే కారణమన్నారు. ప్రకృతికి హాని చేయకుండా చూడటంతో పాటు పరిసరాలను పరిరక్షించాలన్నారు.

జింకను రక్షించిన గ్రామస్తులు

పరిగి: గాయపడిన జింకను గ్రామస్తులు రక్షించి అటవీశాఖ అధికారులకు అప్పగించారు. . శనివారం ఉదయం శ్రీరంగరాజుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానానికి సమీపంలోని కాలువ వద్ద జింక పడి ఉండగా స్థానికులు గుర్తించారు. రెండు కాళ్లు, నడుము వద్ద గాయాలు ఉండటంతో అటవీశాఖ అధికారి ఉషారాణికి ఫోన్‌లో సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న ఆమెకు స్థానికులు జింకను అప్పగించగా చికిత్స కోసం పశువైద్య ఆస్పత్రికి తీసుకెళ్లారు. జింకను అప్పగించిన వారిలో వైస్ సర్పంచ్ మురళీమోహన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ కిరణ్, ఎంపీటీసీ శ్రీనివాసులు, పోస్ట్‌మెన్ శంకరనారాయణ, గంగప్ప తదితరులు ఉన్నారు.

పాఠశాల తనిఖీ

రొళ్ల: పి.గొల్లహట్టి ప్రాథమిక పాఠశాలను శనివారం ఎంఈఓ శ్రీధర్ తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి విద్యార్థుల హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. జగనన్న గోరు ముద్ద పథకం ద్వారా విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని వడ్డించాలన్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం





అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న యూటీఎఫ్ నాయకులు, సోమందేపల్లి తహసీల్దార్‌ను సన్మానిస్తున్నా దృశ్యం

పరిగి: ఉత్తమ అధికారులుగా గణతంత్ర వేడుకల్లో అవార్డులు అందుకున్న ఎంఈఓ లక్ష్మీదేవి, తహసీల్దారు సౌజన్యలక్ష్మీ, డిప్యూటీ తహసీల్దారు లక్ష్మీనరసింహం, మండల సర్వేయరు సుమిత్ర, మోదా సచివాలయ మహిళా సంరక్షణా అధికారి యాస్మిన్‌ను శనివారం యూటీఎఫ్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఎమ్మార్సీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం సత్యకృపరాజు, నాయకులు మహంతి, సుల్తాన్, శ్రీనివాసులు, హఫీజ్, శంకరప్ప, మురళీ, అనిల్, రవిశేఖర్, రాజేశ్వరీ, హనుమంతప్ప, రాజు, అంజినేయులు పాల్గొన్నారు.

సోమందేపల్లి: ఉత్తమ తహసీల్దార్‌గా అవార్డు అందుకున్న గోరంట్ల తహసీల్దార్ రంగనాయకులును శనివారం వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా సత్కరించారు. సెంట్రల్ బ్యాంకు డైరెక్టర్ శంకర్ రెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ నూర్, సింగిల్ విండో అధ్యక్షుడు నబీరసూల్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఉట్లపరుష



ఉట్ల మాను ఎక్కుతున్న దృశ్యం

రొద్దం: మండలంలోని పెద్దమంతూరు పెన్నానది ఒడ్డున కొలువైన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి జాతరలో భాగంగా శనివారం సాయంత్రం ఉట్ల పరుషను నిర్వహించారు. యువత ఉత్సాహంగా పాల్గొని ఉట్ల మాను అధిరోహించడానికి పోటీపడ్డారు. చివరకు ఎల్.తిమ్మాపురం కరుబ పాల నారాయణప్ప అనే వ్యక్తి ఉట్లమానును అధిరోహించి విజయం సాధించారు.అనంతరం అతన్ని ఊరేగించారు.